## సోన్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్

సోన్, మే 14: నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని గాంధీనగర్ గ్రామంలో బుధవారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. 102 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాజేశ్ మీనా పాల్గొని ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్ఐ గోపి పాల్గొన్నారు.

## క్రీడాకారులకు వరం సమ్మర్ క్యాంపు

నిర్మల్ అర్బన్, మే 14: సమ్మర్ క్యాంపు క్రీడాకారులకు వరమని నిర్మల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ అన్నారు. నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును బుధవారం ఆయన సందర్శించారు. క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు క్రీడాకారులు నేర్చుకున్న క్రీడల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా క్రీడల అధికారి శ్రీధర్ రెడ్డి, పీఈటీలు, పీడీలు ఉన్నారు.

## శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ అర్బన్, మే 14: ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో రామారావు అన్నారు. నిర్మల్‌లోని చాణక్య పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ సమన్వయ కర్త ప్రవీణ్ కుమార్, విద్యాసాగర్, డీఆర్పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## సమాజంలో ఉపాధ్యాయుల ప్రాత గొప్పది

నిర్మల్ అర్బన్, మే 14: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని సీనియర్ జడ్జి రాధిక అన్నారు. నిర్మల్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతుల్లో జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో ఫోక్సో చట్టంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఏవో వెంకటరమణ, నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

కుభీర్, మే 14: నిర్మల్ జిల్లా కుభీర్ మండలం పార్డి(బీ) గ్రామంలోని రైతు వేదికలో బుధవారం ఏఈవో అశ్విని, మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ సీఈవో విశ్వనాథ్ భూసార పరీక్షలు, మేలైన విత్తనాల ఎంపిక, వానకాలంలో పంటల సాగు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఐకేపీ సీసీ దత్తాత్రి, వీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

## ఈజీఎస్ పథకంతో గ్రామాల అభివృద్ధి

దస్తురాబాద్, మే 14 : ఈజీఎస్ పథకంతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఏపీడీ నాగవర్ధన్ అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని ఐకేపీ భవనాన్ని, మండలంలోని గొడిసేర్యాల రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈజీఎస్ పథకంలో ఐకేపీ భవనం ముందు షెడ్డు నిర్మాణానికి , సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. అలాగే రైతులు ఈజీఎస్ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రమేశ్, ఏపీఎం గంగాధర్, ఏపీవో రవిప్రసాద్, టీఏ గణేశ్, పంచాయతీ కార్యదర్శులు శేఖర్, శివప్రసాద్ ఉన్నారు.

## పెళ్లికి నిరాకరించిన మగువ

ఉట్నూర్, మే 14: ఉట్నూర్‌కు చెందిన రిటైర్డ్ ఎక్సైజ్ కానిస్టేబుల్ జాదవ్ లక్కు రెండో కుమార్తె ప్రీతితో నార్నూర్ మండలం చోర్‌గాం గ్రామానికి చెందిన రాథోడ్ అజయ్ వివాహం నిర్ణయించారు. అయితే ఇరుకుటుంబీకులు బుధవారం పెళ్లి తంతును స్థానిక తిరుమల ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తుండగా తాళికట్టే సమయానికి మగువ ప్రీతి తనకు వివాహం ఇష్టం లేదని బిష్మించుకొని కూర్చుంది. దీంతో ఇరుకుటుంబాల పెద్దలు ఎంత నచ్చచెప్పిన పెళ్లి కూతురు వినకపోవడంతో పెళ్లి జరగలేదు. దీంతో ఫంక్షన్‌హాల్‌లో గందరగోళం నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఫంక్షన్‌హాల్ వద్ద గొడవ జరగకుండా చూస్తూ సముదాయించిన పెళ్లి కూతురు వినలేదు. దీంతో పెళ్లి రద్దయింది. గ్రామానికి చెందిన బంజారా పెద్దలు ఇరు కుటుంబాలను సముదాయించి మరుసటి రోజు వరకు పెళ్లి కూతురుకు సమయం ఇచ్చారు. దీంతో ఎక్కడి వారు అక్కడికి వెళ్లిపోయారు. పెళ్లి రద్దు కావడానికి పెళ్లి కూతురు మతిస్థిమితం సరిగా లేదని పలువురు పేర్కొన్నారు.



ఖానాపూర్: వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షానికి తడిసిన ధాన్యం కుప్పలు



దస్తురాబాద్ : వర్షానికి తడిసిన ధాన్యం

# తడిసిన ధాన్యం.. రైతులకు నష్టం

దస్తురాబాద్, మే 14 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో బుధవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టె పని రైతులు నిమగ్నమయ్యారు. తూకం వేసిన బస్తాలు వెంటనే రైసు మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు. నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

ఖానాపూర్, మే 14: ఖానాపూర్‌లో బుధవారం ఉదయం అకాల వర్షం కురవడంతో వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం తడిసి ముద్దయింది. అన్నదాత అరుగాలం కష్టపడి పండించిన పంట నేలపాలైందని వాపోయారు. సర్కారు నిర్లక్ష్యంతో కేంద్రం నిర్వహకులు కొనుగోళ్లలో జాప్యం చేశారని అవేదన వ్యక్తం చేశారు. వర్షం నుంచి ధాన్యం కాపాడుకోవడానికి టార్పాలిన్లు ఇవ్వడం లేదని అన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

## చకచకా రెంకోని వాగు వంతెన పనులు



దిలావర్‌పూర్ రెంకోనివాగు వంతెనకు స్లాబ్ వేస్తున్న కాంట్రాక్టర్లు

నమస్తే ఎఫెక్ట్

ఖానాపూర్ రూరల్, మే 2: గత ఏడాదిన్నర నుంచి జాప్యంగా సాగుతున్న దిలావర్ పూర్ రెంకోనివాగు వంతెన నిర్మాణ పనులు పది రోజులుగా చకచకా నడుస్తున్నాయి. ఈ నెల 2వ తేదీన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన నత్తనడకన రెంకోనివాగు వంతెన నిర్మాణ పనులు శీర్షిక కథనానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. కేవలం పది రోజులలోనే స్లాబ్ పనులు పూర్తి చేశారు. వంతెన, ఫిల్లర్లు, స్లాబ్ పనులు పూర్తయ్యాయి. రోడ్డుకు ఇరువైపుల మొరం వేస్తున్నారు. వర్షాలు కురవక ముందే పనులను పూర్తిచేస్తామని ఆర్అండ్‌బీ డీఈ మసూద్ తెలిపారు.

## రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం



వానల్‌పాడ్‌లో నిర్వాహకులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్

భైంసాటౌన్, మే 14 : రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో తాలు, తప్ప పేరిట క్వింటాల్‌కు ఐదు కిలోల దండి కొట్టడం చాలా అన్యాయమని, రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోమని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్ అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతులు, కేంద్రం నిర్వాహకులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. వారం రోజుల నుంచి మండలంలో అక్కడక్కడ వర్షం కురుస్తుండడంతో రైతులు నష్టపోయే అవకాశం ఉందని, కొనుగోళ్లలో వేగం పెంచాలని కోరారు. కూలీల కొరత కారణంగా కొనుగోళ్లు వేగంగా జరగడం లేదని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలు తీరుస్తామని చెప్పి ఎన్నికల్లో గెలిచిన నాయకులు గుళ్ల గోపురాలకు తిరుగుతూ రైతుల వైపు, రైతు సమస్యల వైపు కన్నెత్తి చూడడం లేదని, నియోజకవర్గంలో రైతులను పట్టించుకునే నాయకులే లేరని విమర్శించారు. నియోజకవర్గంలో అత్యధికంగా ఆలయాలు బీఆర్ఎస్ హయాంలోనే నిర్మించడం జరిగిందని తెలిపారు. కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని రెండు, మూడు రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. నిర్వాహకులు ఎలాంటి తరుగు లేకుండా సంచికి సంచి బరువు వేసి తూకం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నిమ్మ సురేశ్, అట్టోలి రాజు, సుభాష్, జనార్దన్, అమీన్, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దస్తురాబాద్, మే 14 : లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులు పరిష్కరించుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను కూడా క్లియర్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని సీఐ అజయ్ కుమార్ సూచించారు. బుధవారం దస్తురాబాద్ పోలీస్ స్టేషన్ సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నారీశక్తి కార్యక్రమాన్ని మహిళా కానిస్టేబుళ్ల ఆధ్వర్యంలో నిర్వహించాలని అన్నారు. సమావేశంలో ఎస్ఐ సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కల గ్రంథం ఆవిష్కరణ

బేల, మే 14 : కొనొకార్పస్ మొక్కలు హానికరముకావని డీఐఈవో జాదవ్ గణేశ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా బేలలోని కీర్తన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరప్రసాద్‌రావు ఇటీవల రాసిన కొనొకార్పస్ మొక్కల పుస్తకాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ వృక్ష శాస్త్ర అధ్యాపకులు బాస భగవాండ్లు పాల్గొన్నారు.

## సెలవులను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న నృత్య శిక్షకురాలు సరిత

నిర్మల్ అర్బన్, మే 14 : వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని శ్రీ విద్యానికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్ అన్నారు. నిర్మల్‌లోని ఇందిరానగర్ కాలనీలోని పాఠశాలలో నృత్య శిక్షకురాలు అనంతుల సరిత ఆధ్వర్యంలో విద్యార్థులకు కూచిపూడిలో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని అన్నారు. కూచిపూడిలో శిక్షణ పొందాలనుకునే విద్యార్థులు పాఠశాలలో ఉదయం సాయంత్రం వేలలో నిర్వహించే శిక్షణకు హాజరుకావాలని తెలిపారు.

## అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, మే 14: అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ జిల్లాలో ఆర్ఎఫ్ఆర్ అమలుపై బుధవారం కలెక్టర్ సమావేశమందిరంలో అటవీ, విద్యుత్, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. మారుమూల అటవీ, గిరిజన, ప్రాంతాల్లో రహదారులు, బ్రిడ్జిలు, విద్యుత్ తదితర అభివృద్ధి పనులు చేపట్టాల్సిన ప్రతి శాఖ తమ ప్రపోజల్స్‌ను అటవీ శాఖతో సమన్వయం చేసుకుని ముందుగా ఆమోదం పొందాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైద్యులను సంప్రదించిన తర్వాతే మందులు వాడాలి

బోథ్, మే 14: ప్రజలు వైద్యులను సంప్రదించిన తర్వాతే మందులు వాడాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు యంత్రాంగం తరపున బోథ్ మండలంలోని పట్నాపూర్ గ్రామంలో జిల్లా వైద్య శాఖ, నిర్మల్ స్వప్న సూపర్ మల్టీ స్పెషాలిటీ దవాఖాన వారి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మొదటగా ఎస్పీకి గ్రామ ప్రజలు డప్పువాయిద్యాలు నడుమ స్వాగతం పలికి ఆహ్వానించారు. వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, యూరాలజీ, గైనకాలజీ, న్యూరాలజీ, పీడియాట్రిషన్, ఆర్థోపెడిక్‌లలో నిష్ణాతులైన వైద్య బృందంచే చికిత్స నిర్మల్ స్వప్న మల్టీస్ సూపర్ స్పెషాలిటీ దవాఖాన సహకారంతో వైద్య చికిత్స అందజేశారు. ఈ శిబిరానికి పట్నాపూర్, ఇన్కర్‌పల్లి, సుర్దాపూర్ మేడిగూడ గ్రామల నుంచి వచ్చిన 250 మంది ఆదివాసీ ప్రజలకు చికిత్స అందించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి, బోథ్ సీఐ వెంకటేశ్వర్ రావు, ఎస్ఐ ప్రవీణ్, అడిషనల్ డీఎంహెచ్‌వో రవీంద్రప్రసాద్, ఏజీపీ పంతం శంకర్, డాక్టర్లు శశికాంత్, స్వప్న, మల్లేశ్, సచిన్‌బాబు, ధ్రువన్ కుమార్, రాహుల్, దినేశ్, బోథ్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, బోథ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## టవర్ నిర్మాణానికి స్థలం పరిశీలన

సారంగాపూర్, మే 14: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని రవీంద్రనగర్‌తండాలో నూతనంగా నిర్మించనున్న బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి ఎఫ్ఆర్‌వో రామకృష్ణరావు స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ డీఆర్‌వో నజీర్‌ఖాన్, ఎఫ్ఎస్‌వో రషీద్ ఖాన్, ఎఫ్‌బీవోలు స్రవంతి ఉన్నారు.

## ప్రజలకు సేవ చేయడం కోసమే పోలీసులు

ఇచ్చోడ(సిరికొండ), మే 14 : ప్రజలకు సేవ చేయడం కోసమే పోలీసులు ఉన్నారని ఇచ్చోడ సీఐ బండారి రాజ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని కుంటగూడ, పాలవాగులో పోలీసులు మీ కోసం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరానికి గురైతే హెల్ప్ 1930 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనబడితే పోలీసులు సమాచారం అందించాలన్నారు. పొలంలో గంజాయి పంట పండిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీసాయి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

జైనథ్, మే 14 : భూ భారతి చట్టం ద్వారా రైతులు తమ భూము సమస్యలు పరిష్కరించుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో భాగంగా బుధవారం ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలోని తరోడ, పెండల్‌వాడ గ్రామాలను సందర్శించారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ శ్యామలాదేవి, తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, గ్రామస్తులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ డే

భైంసా, మే 14 : సమస్యల పరిష్కారానికే ఫిర్యాదుల విభాగం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. బుధవారం నిర్మల్‌లోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదుల విభాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్‌ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సాయాన్ని అందిస్తూ సమస్యలు పరిష్కరించాలని సూచించినట్లు తెలిపారు. అంతేగాక షీటీం సిబ్బందితో కొన్ని కుటుంబాల కలహాల కేసులలో ఇరు పార్టీల వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాశ్ కుమార్, సీఐలు గోపీనాథ్, నైలు, షీటీం మహిళా ఇన్‌చార్జి పెర్సిస్, సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

ఎదులాపురం, మే 14 : ఆదిలాబాద్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (బాలుర, బోథ్)లో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.ఎం శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన బాలురు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9849390495, 7901097689 సెల్‌నంబర్‌ను సంప్రదించాలని, అలాగే పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ https://ttwrdcs.ac.in/Boathలో సంప్రదించాలని సూచించారు.

## పిప్పర్‌వాడలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని త్వరలో ప్రారంభిస్తాం

జైనథ్, మే 14 : ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలోని పిప్పర్‌వాడ గ్రామంలో నాఫెడ్ మార్క్‌ఫెడ్ ద్వారా త్వరలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భోరజ్ మండలంలోని నాలుగో క్లస్టర్‌లో భాగంగా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుకు పిప్పర్‌వాడ గ్రామంలో అధికారులు, నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో జీ గంగన్న, మండల వ్యవసాయాధికారి అష్రాఫ్, సొసైటీ కార్యదర్శి సుశీల్ కుమార్, మాజీ సర్పంచ్‌లు మహేందర్‌రావ్, సంతోష్ రెడ్డి, పోతారెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి

బోథ్, మే 14 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపూర్, అందూర్, బిర్లాగొంది గ్రామాల్లో తాగు నీటి సరఫరా వనరులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ క్రమం తప్పకుండా మిషన్ భగీరథ నీరు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం కుచులాపూర్ గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఇండ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. నాలుగు విడుతల వారీగా ప్రభుత్వం ఆర్థిక సాయం లబ్ధిదారులకు విడుదల చేస్తున్నందున దశల వారిగా నిర్మాణం పూర్తి చేయుటకు ప్రణాళిక వేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

## జొన్నలు మహారాష్ట్ర గుండా తీసుకురావద్దు

భీంపూర్, మే 14 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండల సరిహద్దు కరంజి(టీ) సహా ఇతర గ్రామాల రైతులు తమ జొన్న పంటను తాంసి మార్కెట్ యార్డులో అమ్మేందుకు మహారాష్ట్ర గుండా తీసుకురావద్దని ఏవో శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవో వికాల్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. రోడ్డు బాగా లేని కారణంగా కరంజి , గుబిడి, టేకిడిరాంపూర్, కొజ్జన్‌గూడ గ్రామాల రైతులు సాధారణంగా మహారాష్ట్ర మాండ్వి , లక్ష్మీపూర్ చెక్‌పోస్టు గుండా తీసుకువస్తుంటారని అయితే చెక్‌పోస్టులో ఇప్పుడు అనుమతించడం లేదని పేర్కొన్నారు. అందుకు తెలంగాణ సంబంధిత కరంజి(టీ)–ఆదిలాబాద్ ఆర్అండ్‌బీ రోడ్డు ద్వారానే అన్ని అనుమతులు ఉన్న వాహనాలతో జొన్న పంట తీసుకురావాలని పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఉట్నూర్ రూరల్, మే 14: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని గంగన్నపేట్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్డీవో రాథోడ్ రవీందర్, ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, ఏపీడీ గోవింద్‌రావ్, డీటీ ప్రేమ్‌నివాస్, ఆర్‌టీఏ సభ్యుడు దూట రాజేశ్వర్, ఐకేపీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## తప్పడు ఫోన్ కాల్స్‌కు స్పందించి పన్నులు కట్టవద్దు

భైంసా, మే 14 : తప్పుడు ఫోన్ కాల్స్‌కు స్పందించి పట్టణ ప్రజలు ట్రేడ్ లైసెన్సులతో పాటు ఇతర ఎలాంటి పన్నులు చెల్లించవద్దని భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేశ్ కుమార్ పట్టణ ప్రజలను కోరుతూ వీడియో రిలీజ్ చేశారు. ఎవరో ఒక వ్యక్తి తాను మున్సిపల్ కమిషనర్ అని చెబుతూ ట్రేడ్ లైసెన్సుకు డబ్బులు చెల్లించాలని కోరిన విషయం తన దృష్టికి వచ్చిందని అట్టి ఆడియోను సైతం తాను విన్నందున పట్టణ ప్రజలు సైబర్ మోసాలకు గురికావద్దన్నారు. తాను కాని, తమ సిబ్బంది కాని పన్నులు, ట్రేడ్ లైసెన్సుల కోసం ఫోన్లు చేయమన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. అలాంటి ఫోన్ కాల్స్ వస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ట్రేడ్ లైసెన్సులు, ఇతర పన్నుల చెల్లింపుల కోసం కార్యాలయంలో నేరుగా తనను గాని, తన సిబ్బందిని గాని సంప్రదించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## కొత్త విధానాల మార్గదర్శకాలు పాటించాలి

ఎదులాపురం, మే 14: కొత్తగా వచ్చిన విధానాల మార్గదర్శకాలు పాటించాలని యూఐడీఏఐ అసిస్టెంట్ మేనేజర్ సౌబన్ రబ్బానీ మహ్మద్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ఆధార్ నిర్వాహకులకు యూఐడీఏఐ హైదరాబాద్ నుంచి వచ్చిన యూఐడీఏఐ అసిస్టెంట్ మేనేజర్ సౌబన్ రబ్బానీ మహ్మద్ శిక్షణ కల్పించారు. ఇందులో భాగాంగా కొత్త విధానాల మార్గదర్శకాలు కోసం ఆధార్ రిఫ్రెషర్ శిక్షణపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈడీఎం బండి రవి, ఉమ్మడి జిల్లా మీసేవ ఆధార్ నిర్వాహకులు జోగు సాగర్, కర్నె భాస్కర్, పవన్, ఖాసిం, తన్వీర్, సంతోష్, స్వాగత, శేషగిరి యాదవ్, లక్ష్మీనారాయణ, హబీబ్, మల్లేశ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

## హక్కు పత్రాలు లేని భూముల్లో పంటలు సాగు చేస్తే చర్యలు

పెంబి, మే 14: ఎలాంటి హక్కు పత్రాలు లేని పోడు భూముల్లో పంటలు సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెంబి అటవీ శాఖ అధికారి రమేశ్ రావు అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని ఇటిక్యాల, ఎంగ్లాపూర్ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్వో ప్రతాప్ నాయక్, ఎఫ్ఎస్‌వో సుందర్, ఎఫ్‌బీవోలు నరేశ్, స్రవంతి, లాలజీ, కిరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఇంద్రవెల్లి, మే 14 : కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అవలంబిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ 20వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న పిలుపునిచ్చారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ అవరణలో కార్మికులతో కలిసి సీఐటీయు నాయకులు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు సుభద్ర, ఆత్రం సోనేరావ్, వెంకట్‌రావ్, మల్లమ్మ, అజయ్, మీరాబాయి పాల్గొన్నారు.

## లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

ఇచ్చోడ(సిరికొండ), మే 14: నిరుద్యోగ అభ్యర్థులు లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఉపేందర్ తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా సిరికొండలోని మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులు ఈ నెల 17వ తేదీలోగా సమర్పించాలన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 సంవత్సరాలు లోపు ఉండాలన్నారు. అభ్యర్థులు ఇంటర్‌లో ఎంపీసీలో కనీసం 60 శాతం మార్కులతో పాటు ఐటీఐ, డిప్లొమా, బీటెక్ అర్హత కలిగి ఉండాలని అన్నారు. శిక్షణ నిమిత్తం వోసీ అభ్యర్థులకు రూ.10 వేలు, బీసీలు రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ రూ.2500 చెల్లించాలన్నారు. ఏమైనా వివరాలు కావాలంటే తహసీల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఆయన వెంట మీ సేవ కేంద్రం సిబ్బంది ఉన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

తాంసి, మే 14 : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాథోడ్ నరేందర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని గిరిగామ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు. గ్రామంలో శానిటైజేషన్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, వైద్యాధికారి నిఖిల్, బీఆర్ఎస్ నాయకుడు ఉత్తమ్, పంచాయతీ కార్యదర్శి కార్తీక్, సిబ్బంది ఉన్నారు.

## మూడున్నర తులాలు అపహరించిన అగంతకుడు

ఎదులాపురం, మే 14: వృద్ధురాలికి గోల్డ్‌లోన్ ఇప్పిస్తానంటూ మాయ మాటలు చెప్పి మూడున్నర తులాల బంగారాన్ని అపహరించిన ఘటన ఆదిలాబాద్‌లో చోటు చేసుకుంది. ఆదిలాబాద్‌లోని దస్నాపూర్‌లో నివాసముండే సరస్వతి (80) ఇంటికి మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. బంగారం ఉంటే మీకు లోన్ ఇప్పిస్తానని, లేదా బంగారం తీసుకున్న రసీదు ఉన్న లోన్ వస్తుందని మాయమాటలు చెప్పాడు. నిజమని నమ్మిన వృద్ధురాలు అల్లుడు భూమన్న (65) మూడున్నర తులాల బంగారు ఆభరణాలు తీసుకుని అగంతకుడు వచ్చిన ద్విచక్ర వాహనంపై కూర్చొని వెళ్లాడు. రాంనగర్ సమీపంలోని ప్రైవేట్ బ్యాంక్ వెళ్లాడు. భూమన్నను ఇక్కడే ఉండు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొస్తానంటూ అక్కడి నుంచి పారిపోయాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. సీసీ పుటేజ్ ఆధారంగా అగంతకుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

## యువతి అదృశ్యం

నర్సాపూర్(జీ), మే, 14 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)లో యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ సాయికిరణ్ తెలిపారు. గ్రామానికి చెందిన బర్కుంట వాణి గత నెల 23న ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికిన లభించలేదు. యువతి తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఛత్రపతి శంభాజీ మహారాజ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

నార్నూర్,మే14 : యువత ఛత్రపతి శంభాజీ మహారాజ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని మాజీ సర్పంచ్ రాథోడ్ సావీందర్ అన్నారు. బుధవారం రాజుల్‌గూడ గ్రామంలో ఛత్రపతి శంభాజీ మహారాజ్ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాథోడ్ దిగంబర్ నాయక్, గో సేవ వ్యవస్థాపకుడు రాంనివాస్, బీజేపీ మండలాధ్యక్షుడు రాథోడ్ బిక్కు, గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

## లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

నిర్మల్ చైన్‌గేట్, మే 14 : మహిళపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిర్మల్‌లోని విద్యుత్ కార్యాలయ సమీపంలో 2022 జూలై 20న చెత్త ఏరుకోవడానికి వచ్చిన ఓ మహిళపై బుధవార్‌పేటకు చెందిన సొన్న ఆడెల్లు ఎవరు లేనిది చూసి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ కేసులో పోలీసులు సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో బుధవారం జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీవాణి నేరస్థునికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

## గంజాయి అమ్ముతున్న యువకుడిపై కేసు

ఎదులాపురం, మే 14: ఆదిలాబాద్ పట్టణం తిర్పెల్లిలోని పాన్ షాప్‌లో చిన్న చిన్న ప్యాకెట్లు చేసుకుంటూ గంజాయి అమ్ముతున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. తిర్పెల్లికు చెందిన షేక్ నౌషద్ (24) ఐదారునెలల నుంచి మహారాష్ట్రలోని కిన్వాట్‌కు చెందిన ఖుర్బాన్ నుంచి ఎండిన గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసుకుంటూ ఆదిలాబాద్ ప్రజలకు ఎక్కువ ధరకు అమ్ముతున్నాడు. బడ్కమొహాళ్ల చెరువు కట్ట వద్ద గంజాయి తాగుతూ షేక్ నౌషద్‌ను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి నిర్ధారణ పరీక్ష చేయగా అందులో పాజిటివ్ వచ్చిందన్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ద్విచక్రవాహనం నంబర్ మార్ఫింగ్ చేసిన వ్యక్తిపై..

ఎదులాపురం, మే 14: ఆదిలాబాద్‌లోని ఖుర్షిద్‌నగర్‌లోని అబ్దుల్ తాజ్‌బుల్‌కు చెందిన ద్విచక్ర వాహనం నంబర్‌ను మార్ఫింగ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ ఎస్ఐ విష్ణు ప్రకాశ్ తెలిపారు. ద్విచక్ర వాహనం టీఎస్01 ఏ 5962 నంబర్‌ను టీఎస్0ఈఏ 596 మార్చినందుకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## తెల్లకల్లు అమ్ముతున్న వ్యక్తిపై..

ఎదులాపురం, మే 14 : ఆదిలాబాద్‌లోని ఖుర్షిద్‌నగర్‌లో సతీశ్ గౌడ్ ఇంట్లో తెల్లకల్లు అమ్ముతున్నందున అతనిపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ ఎస్ఐ విష్ణు ప్రకాశ్ తెలిపారు. అతని వద్ద 5.2 లీటర్ల తెల్లకలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

## మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని గొడవ

ఎదులాపురం, మే 14 : మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని గొడవకు దిగిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ ఎస్ఐ విష్ణు ప్రకాశ్ తెలిపారు. ఆదిలాబాద్‌లోని ఇందిరానగర్ కు చెందిన కృష్ణ, భుజంగ్, పవన్ అదే కాలనీలో నివాసముంటున్న లోకండే గణేశ్‌ను మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతను ఇవ్వకపోయేసరికి అతనిపై గొడవ చేస్తూ దాడి చేశారు. దీంతో మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## గుండుంబా అమ్మితే చర్యలు

దస్తురాబాద్, మే 14 : గుడుంబా అమ్మిన, తయారు చేసిన చట్ట పరమైన చర్యలు తప్పవని ఎస్ఐ సాయికుమార్ అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని గోడిసెర్యాల గ్రామంలో ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. కొంపల్లి నర్సయ్య నుంచి 8 లీటర్లు, జక్కుల సత్తవ్వ వద్ద 9 లీటర్లు, బత్తుల రాజన్న వద్ద 12 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677